క్లుప్తంగా

శ్యామలాంబకు ప్రత్యేక పూజలు


గొంచాల గ్రామంలోని శ్యామలాంబ దేవి

సామర్లకోట: మండల పరిధిలో గొంచాల గ్రామంలో కొలువైన శ్యామలాంబ దేవికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని గ్రామానికి చెందిన సామన శ్రీకోటిలింగాలు, చక్రం దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గొంచాల, అచ్చంపేట గ్రామానికి చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త ముమ్మిడి వెంకటేశ్వర రావు భక్తులకు సేవలందించారు.

10, 11 తేదీల్లో ఉపవాస ప్రార్థన కూడికలు

పెద్దాపురం: మండలంలోని దివిలి క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరాల్లో ఏటా నిర్వహించే ఉపవాస ప్రార్థనల్లో భాగంగా 10, 11 తేదీల్లో పిఠాపురం మండలం విరవ చర్చిలో నిర్వహించనున్నట్లు మందిరాల వ్యవస్థాపకులు నంగిన సత్యానందం, సీజీఎం వ్యవస్థాపకుడు నంగిన శామ్యూల్ సుదీప్ తెలిపారు. గురువారం దివిలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించే ఉపవాస ఉజ్జీవ వేడుకలకు నిత్యం ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం ఒంటిగంటకు, రాత్రి ఏడు గంటలకు ప్రార్థనా కూడికలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కూడికల్లో భాగస్వాములు కావాలని వారు కోరారు.

ఫ్లైఓవర్‌పై గోతుల పూడ్చివేత


ఫ్లైఓవర్‌పై గోతులు సరిచేయిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

సామర్లకోట: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఏర్పడిన గోతులను ట్రాఫిక్ పోలీసులు పూడ్పించారు. పెద్దాపురం ఏడీబీ రోడ్డు నుంచి ఫ్లైఓవర్ ఎక్కే రోడ్డు నుంచి కాకినాడ రోడ్డులో బ్రిడ్జి దిగే వరకు ఉన్న గోతుల వల్ల చిన్న, భారీ వాహనాలు చిక్కుకుని ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మేరకు జాతీయ రహదారి నిర్మాణ కాంట్రాక్టర్‌తో మాట్లాడి సిమెంట్ కాంక్రీట్‌తో వారి కార్మికుల సాయంతో గోతులు పూడ్పించారు. దీంతో ప్రయాణికులు ట్రాఫిక్ పోలీసు సిబ్బందిని అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపల్లి: మండలంలోని కోనపాపపేట సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ కోనపాపపేట, 11 కేవీ శ్రీరాంపురం, 11 కేవీ ఇండస్ట్రియల్ లైన్లపై మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీ ఈపీ డీసీఎల్ పెద్దాపురం డివిజన్ ఈఈ ఏవీఎస్ఎస్ ప్రభాకరావు గురువారం తెలిపారు. శ్రీరాంపురం, ముమ్మిడివారిపాడు, కోపపాపపేట, మల్లివారితోట, రావివారిపోడు, రామరాఘవపురం గ్రామాలతో పాటు రమణక్కపేట, నాగులపల్లి, శ్రీరాంపురం చెరువులకు ఉదయం 8 నుంచి 10 వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వివరించారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలన్నారు.

ప్లాస్టిక్‌ను వదిలేద్దాం..


ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సామర్లకోట: ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని ప్రేమిస్తూ ప్లాస్టిక్‌ను వదిలి వేయాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల నిషేధ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఎకో క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తినుబండారాలు ఆహార పదార్థాలు తీసుకువెళ్తున్న పాలిథిన్ సంచుల ద్వారా అనేక ఉదర సంబంధ వ్యాధులు వస్తున్నాయని వివరించారు. ఈ మేరకు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధిస్తామని ఉపాధ్యాయులు, విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువులను రోడ్లపై వదలద్దు

కాకినాడ రూరల్: పశువులను రోడ్లుపైకి వదిలితే కేసులు నమోదు చేస్తామని ఇంద్రపాలెం ఎస్సై ఎం.వీరబాబు హెచ్చరించారు. ఇంద్రపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాలలో గురువారం రాత్రి ఆయన సిబ్బందితో కలిసి పర్యటించి స్వేచ్ఛగా రోడ్లుపై తిరుగుతున్న పశువులను గుర్తించారు. రోడ్లపై పశువులు సంచరించడం వలన వాహనచోదకులు, పాదచారులకు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

చురుగ్గా ఖరీఫ్ పనులు

- నాట్లకు ప్రాధాన్యం ఇస్తున్న రైతులు
- పూతిక కేళీతో ఆందోళన


జి.మేడపాడులో బిహారీ కూలీలతో వరి నాట్లు


నిండుగా ఉన్న గోదావరి కాలువ

సామర్లకోట: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు, గోదావరి నీరు అందుబాటులోకి రావడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. పొలాలను దమ్ముచేసి వరినాట్లలో బిజీ అయిపోయారు. కూలీల కొరత, రేట్లు పెరిగిపోవడంతో బీహార్ కూలీలతో నాట్లు వేయిస్తున్నారు. గతంలో వెదజల్లు పద్ధతిలో సాగుకు ఆసక్తి చూపే వారు. అయితే పూతిక కేళీ ఎక్కువగా రావడంతో కూలీలతో నాట్లకు మక్కువ చూపుతున్నారు. మండల పరిధిలో ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమవుతుండగా 50 శాతం కూలీలతో వరి నాట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నారని మండల వ్యవసాయాధికారులు చెప్తున్నారు. ఎకరంలో వరినాట్లకు కనీసం 10 మంది కూలీలు అవసరం కాగా, కేవలం ఐదుగురితో బీహార్ కూలీలు పని కానిచ్చేస్తున్నారు. స్థానిక కూలీలకు రూ.8 వేలు ఖర్చుచేయాల్సి వస్తే బీహారీ కూలీలకు రూ.మూడు వేలు మాత్రమే వ్యయమవుతోందని, అదే వెదజల్లు పద్ధతిలో ఇద్దరికి రూ.1600 సరిపోతుందని రైతులు చెప్తున్నారు. వెదజల్లు పద్ధతిలో సాగుచేసిన పొలం కోతకు సిద్ధం కావడంతో ఎకరానికి సుమారు రూ.25 వేలు ఖర్చు అవుతుందని, అదే విధంగా బీహారీ కూలీలతో వరి నాట్లు వేయడం, కూలీలతో వరి పంట కోత కోవడంతో ఎకరానికి రూ.30 వేలు అవుతుందని రైతులు అంటున్నారు.

మండల పరిధిలో 22,250 ఎకరాల్లో వరి సాగవుతోందని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. కాగా గొంచాల, అచ్చంపేట గ్రామాల్లో 25 శాతం వరకు రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. వెదజల్లు పద్ధతిలో సాగులో పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు పడితే పంట నష్టపోవాల్సి వస్తోందని, గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పంట పడిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భారం అయినా కూలీలతోనే నాట్లు



వ్యవసాయ కూలీలతో సాగు వ్యయం పెరుగుతున్నా పూతిక కేళీని దృష్టిలో ఉంచుకుని బీహార్ కూలీలతో నాట్లు వేయిస్తున్నాం. వీరి విధానంలో మడిలో నాట్ల సంఖ్య పెరిగి దిగుబడి పెరుగుతుంది. కొందరు రైతులు పంట కోత అయిన తరువాత కేళీ నివారణకు నిప్పు పెడుతున్నారు. అయినా కేళీ చని పొవడం లేదు. భూమి సారం కూడా పోతోంది. నాట్లు వేసినా యంత్రాలతో కోయవచ్చు. అలాగే ధాన్యం విక్రయించి రెండు నెలలు గడిచి సొమ్ము రాలేదు.

– మోరంపూడి రమేష్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్, జి.మేడపాడు

ఎకరానికి రూ.670 ప్రీమియం చెల్లించాలి



ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటల బీమా పొందడానికి ఎకరానికి రూ.670 చెల్లించాల్సి వస్తోంది. ఈ ప్రీమియం ఆగస్టు 15 లోపు చెల్లించాలి. రుణం తీసుకునే రైతుల నుంచి బ్యాంకు అధికారులు బీమా ప్రీమియంను వారి తరఫునే చెల్లిస్తారు. బీమా అవసరం లేదంటే లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాలి. కౌలు రైతులు పంట ధ్రువీకరణ పత్రం ఆధారంగా బీమా చెల్లించాలి. స్వయంగా పెట్టుబడితో సాగు చేసుకునే రైతులు బ్యాంకులో గాని, కామన్ సర్వీసు సెంటర్ నుంచి గాని, ఆన్‌లైన్‌లో బీమా ప్రీమియం చెల్లించవచ్చు. గతంలో కంటే ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కూలీలతో నాటు వేయిస్తున్నారు. పూతిక కేళీ ఎక్కువగా ఉందని గుర్తించాం.

– వి.మురళీధర్, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

భక్తిశ్రద్ధలతో మహిషాసుర మర్దిని అభిషేకాలు


పంచారామ క్షేత్రంలోని మహిషాసుర మర్దిని అమ్మవారు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో కొలువైన మహిషాసుర మర్దిని ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ దుర్గాష్టమి సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. ఈఓ బళ్ల నీలకంఠం, ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ కంటే బాబులు పీటలపై కూర్చుని పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, పూజలు, చేసి అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణ, మండల పరిధిలోని అనేక గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారి అభిషేకాలు, పూజలు తిలకించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేశారు. ఈనెల 23వ తేదీన పంచారామ క్షేత్రంలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారిని శాకంబరిగా అలంకరించనున్నట్టు ఈఓ నీలకంఠం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం గ్రామ దేవత నూకాలమ్మ ఆలయం నుంచి అమ్మవారికి సారె తీసుకువెళ్లనున్నట్టు తెలిపారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి


అధికారులకు సూచనలిస్తున్న జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు

జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు

పిఠాపురం: గ్రామాల్లో పారిశుధ్యపనులపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని జెడ్పీ సీఈఓ వీవీవీఎస్ లక్ష్మణరావు అధికారులను ఆదేశించారు. ప్రత్యేక పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా గురువారం ఆయన గొల్లప్రోలు మండలం దుర్గాడ పరిధిలో పర్యటించారు. తడి, పొడి చెత్త సేకరణను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ఈబీసీ కాలనీలో వాటర్ ట్యాంకును సందర్శించి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేసేలా చూడాలని అక్కడి ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కు సూచించారు. గ్రామంలోని వాటర్ పైపులైన్లు, డ్రైన్లు కలిసిన చోట లీకేజీలు, మరమ్మతులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలోని అన్నిచోట్ల చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి అన్ని పనులు సక్రమంగా జరిగేలా చూడాలని ఎంపీడీఓ స్వప్నకు ఇతర అధికారులకు సూచించారు.

పెద్దాపురంలో డీపీఓ ఆధ్వర్యంలో..

పెద్దాపురం: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి కె.రవికుమార్ ఆదేశించారు.


జి.రాగంపేట సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ రవికుమార్

మండలంలోని జి.రాగంపేట, దివిలి, చదలాడ గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ రవికుమార్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. మురుగు ఎక్కువగా పారి దోమల ఉధృతి అధికమయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా సకాలంలో జరపాలని ఆదేశించారు. అనంతరం ఆయా గ్రామాల్లో పర్యటించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఈశ్వరరావు, ఎస్.సత్యనారాయణమూర్తి సిబ్బంది పాల్గొన్నారు.

మెకానిక్‌లను అసంఘటిత కార్మికులుగా గుర్తించాలి


సామర్లకోటలో కేక్ కట్ చేస్తున్న మోటారు సైకిల్ మెకానిక్‌లు

సామర్లకోట: ప్రపంచ మెకానిక్ డేను శ్రీలక్ష్మీ గణపతి స్కూటర్ అండ్ మోటారు సైకిలు రిపేరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపం వద్ద గురువారం నిర్వహించారు. మోటారు సైకిళ్ల సృష్టికర్త గాట్లీబ్ డైమ్లర్ చిత్ర పటానికి ఈ సందర్భంగా వారు నివాళులు అర్పించారు. యూనియన్ అధ్యక్షుడు ఇందన రాము మాట్లాడుతూ మోటారు మెకానిక్‌లు ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. మెకానిక్‌ల సమస్యలపై రాష్ట్ర యూనియన్ పోరాటం చేస్తుందని చెప్పారు. ప్రభుత్వం మోటారు సైకిల్ మెకానిక్‌లను అసంఘటిత రంగ కార్మికులుగా గుర్తించి, ప్రభుత్వ పథకాలను అమలు చేయాలన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచారు. ఈ మేరకు ర్యాలీ నిర్వహించి స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు, రొట్టెలు, బడేలమ్మ చెరువు వద్ద ఉన్న సిరి మానసిక దివ్యాంగుల పాఠశాలలోని విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఎండీ హనీఫ్, కార్యదర్శి తణుకు శ్రీను, కోశాధికారి ఎ.ఆనంద్ సీనియర్ సభ్యులు ఆంద్ర నూకరాజు, జి.ప్రకాశరావు, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శాంతివర్ధనలో..

పెద్దాపురం: టూ వీలర్ వెల్ఫేర్ మెకానిక్ బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, మెకానిక్‌లకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించాలని సామర్లకోట లక్ష్మీ గణపతి స్కూటర్స్ అండ్ మోటార్ సైకిల్ రిపేరింగ్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తూరంపాటి లక్ష్మణరావు అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభా వంతుల పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ప్రతి టూ వీలర్ మెకానిక్‌కు కార్మిక శాఖ ద్వారా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇవ్వాలన్నారు. మెకానిక్‌లకు ఉపాధి కల్పించేందుకు ష్యూరిటీ, వడ్డీలేని ఐదు లక్షల సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా మెకానిక్‌ల ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతదని అన్నారు. తొలుత విభిన్న ప్రతిభావంతులచే కేక్ కట్ చేయించి వారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. అనంతరం మెకానిక్ గురువు సత్యన్నారాయణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి జామి శ్రీను, ఉప్పరపల్లి సాంబశివ, సారంపాటి రాజు, కర్రి బుజ్జి, బట్ట సోమరాజు, మహేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

చేతి రాతపై శ్రద్ధ చూపాలి


సామర్లకోటలో విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ పుల్లయ్య

సామర్లకోట: ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు చేతి రాతపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల విద్యా శాఖాధికారి-2 పి. పుల్లయ్య సూచించారు. స్థానిక పంతం పద్మనాభం ఎలిమెంటరీ పాఠశాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులు క్రమశిక్షణతో పాటు యూనిఫారం ధరించేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. వర్కు బుక్స్, టెస్టు పుస్తకాలను శుభ్రంగా ఉంచుకునేలా అవగాహన వారిలో అవగాహన పెంచాలని సూచించారు. దస్తూరి అందంగా ఉంటే మంచి మార్కులు రావడానికి వీలు ఉంటుందని, వారు రాసుకున్న నోట్స్ ఇంటి వద్ద తల్లిదండ్రులు చెప్పడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ మేరకు మధ్యాహ్న భోజన పథకం రికార్డులను పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తయారు చేయాలని ఎంఈఓ సూచించారు. పాఠశాలకు హాజరైన ప్రతి విద్యార్థి భోజనం చేయగలిగేలా రుచికరంగా వండాలని నిర్వాహకులకు సూచించారు. ఈ మేరకు హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు భోజనాన్ని రుచి చూడాలని ఆదేశించారు. హెచ్‌ఎం ఎం. నాగేశ్వర రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విద్యార్థులు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. గురువారం పట్టణ పరిధిలో బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో అమలవుతున్న భోజన పథకాన్ని ఆయన పరిశీలించి పలు సూచనలిచ్చారు. ఈ నెల పదో తేదీన నిర్వహించనున్న మెగా టీచర్స్ డే విజయవంతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సాయంత్రం సమయం విద్యార్థులకు అమలు జరుగుతున్న విద్యాశక్తి కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తోటకూర సాయి రామకృష్ణ, పీడీ పి.సుధారాణి పాల్గొన్నారు.

పేదల సేవలో మండల పాస్టర్లు


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ మోజెస్ తదితరులు

సామర్లకోట: పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో మండల పాస్టర్స్ అసోసియేషన్ ముందు ఉంటుందని మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్ అన్నారు. ఇండియన్ క్రిస్టియన్స్ డేను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కోవిడ్ సమయంలోను అనేక మంది పాస్టర్లు పేద ప్రజలకు అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ మేరకు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు, స్థానిక సిరి మానసిక దివ్యాంగుల కేంద్రంలోని 150 మంది విద్యార్థులకు పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. దీనిలో భాగం గా స్థానిక రిక్షా కార్మికులకు, వృద్ధులకు దుప్పట్లు, పులిహోర ప్యాకెట్లు అందజేశారు. సంఘ అధ్యక్షుడు టి.బ్లెస్సింగ్ అధ్యక్షత వహించగా కార్యదర్శి కె.జయబాబు, ఉపాధ్యక్షుడు టి.తిమోతి, సహాయ కార్యదర్శి వై.రాము, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

కోతకు గురవుతున్న బీచ్ రోడ్డు


ప్రమాదకరంగా మారిన బీచ్ రోడ్డు

భయాందోళనలో ప్రయాణికులు

కొత్తపల్లి: ఎటువంటి తుపాను హెచ్చరికలు లేనప్పటికీ సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. దీంతో ఉప్పాడ-కాకినాడ బీచ్‌రోడ్డు కోతకు గురై ధ్వంసమవుతోంది. ఉప్పాడ శివారు ఎస్సీజీఎల్ సమీపంలో బీచ్ రోడ్డు ఒకవైపు పూర్తిగా కోతకు గురైంది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కోతకు బీచ్‌రోడ్డుకు మరమ్మతులు చేపట్టాని ప్రయాణికులు కోరుతున్నారు.

పూరింటి నిర్మాణానికి ఆర్థిక సాయం

కరప: విశ్రాంత ఉద్యోగి వితరణతో కరపలోని నిరుపేదకు ఆర్థిక సాయమందింది. స్థానిక గ్రామశివారు నక్కావారి ఎస్సీ వీధికి చెందిన ఉల్లం దేవుడు తాటాకు ఇంటి పైకప్పు ఇటీవలి వర్షాలకు ఎగిరిపోవడంతో ఆ కుటుంబం నీడను కోల్పోయింది. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఈ విషయాన్ని విశ్రాంత చీఫ్ లేబర్ ఆఫీసర్ వి.శ్రీనివాసరావు(కాకినాడ)కు ఈ విషయాన్ని వివరించగా ఆయన రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. ఆ సొమ్మును తాతీలు గురువారం దేవుడుకు అందజేశారు.


గ్రామ దేవతల ఊరేగింపు


అమ్మవార్ల వేషధారణలో ముత్తైదువలు

ఊరి మంచి కోసం గ్రామపెద్దల నిర్ణయం

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడలో గురువారం గ్రామ దేవతలను ఊరేగించారు. ఊరికి మంచి జరగాలని వేటకు వెళ్లే మత్స్యకారులు సురక్షితంగా మత్స్య సంపదతో చేరాలని కోరుతూ అమ్మవార్ల వేష ధారణలతో మహిళలు గ్రామంలో తిరిగి ప్రజలకు దీవెనలు ఇచ్చారు. పెద్ద దేవ, చిన్న దేవ, మత్స్య ముత్యం, కమ్మిలమ్మ, చిలకమ్మ, బంగారమ్మ, ముత్యాలమ్మ, రెక్కలమ్మ, నాగదేవత వంటి అమ్మవార్ల రూపాల్లో వారు గ్రామంలో ఊరేగారు. ఉప్పాడ తీరంలో సముద్రానికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. వారి వద్ద ఉన్న పసుపు, కుంకుమలను భక్తులకు అందించారు.

అమ్మవారిని సాగనంపడం తరతరాల నమ్మకం



అమ్మవార్లను ఘనంగా సాగనంపితే ఊరికి మంచి జరుగుతుందని, మత్స్యకారుల కుటుంబాల్లో తరతరాలుగా వస్తున్న నమ్మకం. గతంలో ప్రతి రెండేళ్లకు ఒకసారి పండగ వాతావరణంలా ఒక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగేది. గత 20 ఏళ్లుగా ఇలా సాగనంపే కార్యక్రమం నిర్వహించలేదు. ఈ సంవత్సరం మత్స్యకారులకు చేపలు లభించకపోవడం, వేటకు వెళ్ళిన వారికి ప్రమాదాలు జరగడం, సముద్రం ఉగ్రరూపం దాల్చి తీరం వెంబడి ఇళ్లు సముద్రంలో కలిసిపోతుండడంతో గ్రామపెద్దలు అమ్మవార్లను సాగనంపి గంగమ్మతల్లికి పూజలు చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా గురువారం అమ్మవారి వేషధారణలో ఉన్న ముత్తైదువలు కటిక ఉపవాసంతో ఉంటారు.

కోడా లక్ష్మి, నాయకర్ కాలనీ, ఉప్పాడ

యథేచ్ఛగా గడువు తీరిన వస్తువుల విక్రయం

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడలో ఉన్న ఒక దుకాణంలో గడువు తీరిన వస్తువులను విక్రయిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండు, మూడు నెలలు గడువు తీరిన చాక్‌లెట్లు, బాదం పప్పుతో పాటు పలు వస్తువులను విక్రయిస్తున్నారని, అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కొనుగోలుదారులు కోరుతున్నారు.



గడువు తీరిన చాక్‌లెట్


గడువు తీరిన బాదం ప్యాకెట్